# “నీ నామమును మహిమపరచుము”

# (12:9-50)

మూడు చెట్లు అనే అద్భుతమైన పాత కథ అనేక భాషలలో చెప్పబడింది. ఒక కొండ మీద మూడు చెట్లు పెరుగుతున్నాయట. అవి పెరిగి పెద్దయిన తరువాత ఏమి చేస్తాయో కలలు కన్నాయట. మొదటి చెట్టు రత్నాలు, వజ్రాలను గూర్చి కలకని, ప్రశస్తమైన ఆభరణాలు దాచుకునే పెట్టె కావాలనుకున్నదట. రెండవ చెట్టు ప్రయాణము, ఉల్లాసాన్ని గూర్చిన కలకందట. శక్తివంతమైన ప్రయాణపు ఓడగా మారి, సముద్రాల్లో రాజులను కొనిపోవాలని అనుకుందట. మూడవ చెట్టుకైతే పర్వత శిఖరాన్ని వదలే ఏ ఆలోచనా లేదట. అయితే దాని కోర్కేమంటే, నిటారుగా, ఎత్తుగా ప్రజలను దేవునివైపు చూపించేలా నిలవాలనేనట.

సంవత్సరాలు గతించిపోయాయ్, చెట్లు ఏపుగాను బలంగాను పెరిగాయి. ఒక రోజు చెట్లు కొట్టేవారు పర్వతం మీదికి వచ్చి, చెట్లు కొట్టాలని చూస్తున్నారట. నరికేవాడు మొదటి చెట్టు వద్దకు వచ్చి, “నాకు కావలసిన చెట్టు యిదే” అని అతడు దానిని నరికి పడవేశాడు. చెట్లు నరికే మరొకడు అదే సంగతి చెప్పాడట, దానిని కూడా కొట్టి పడవేశాడు. చెట్లు నరికే మూడవవాడు, నా పనికి ఏదైనా ఫరవాలేదులే అని గొణుగుతూ, మిగిలినదానిని అనాలోచనగానే నరికివేశాడు.

మొదటి చెట్టు పెట్టెగా మల్చబడుతున్నప్పుడు, ఆభరణాల పెట్టె కావాలనే తన కల నెరవేరుతుందని తలంచిందట. ఏదియెలాగున్నా, అది సాధారణంగాను, మొరటుగాను ఉండి జంతువులకు గడ్డివేసే తొట్టిలా చేసినట్టు గ్రహించింది. గొప్ప ఓడ కావాలనుకున్న చెట్టు చిన్న నావగా చేయబడినట్టును, చిన్న చెరువులకంటె ఏ పెద్ద దానిమీద ఎన్నడూ నడిచే వీలులేనట్టు గ్రహించింది. మూడవ దానికి మరింత దారుణమైన అనుభవం కలిగింది. అది యితరమైన వాటిచేత అతికించబడి పనికిరాని సామాగ్రి పడవేసేదిగా తుంచివేయబడిందట.

కాలం గడిచింది, మూడు చెట్లకు వేర్వేరు అనుభవాలు వచ్చాయి. ఒక రాత్రి గ్రామ యువక దంపతులు తమకు పుట్టిన బిడ్డను, సత్రంలో స్థలం లేనందున చెట్టుతో చేసిన తొట్టిలో ఉంచారు. వారు సరిక్రొత్త గడ్డిని ఆ తొట్టిలో ఉంచి చిన్న గదిగా దానినుప యోగించారు. క్రొత్తగా జన్మించిన శిశువును ఊయల తొట్టిలో ఎత్తి పట్టినట్టు, లోకంలో మహా ఉన్నతమైన ధనాన్ని ఎత్తుకున్నట్టు ఆ చెట్టు గ్రహించిందట. (బోటుగా) పడవగా మారిన చెట్టు ఒక రాత్రివేళ, పడవలో తుఫానులో గుండా కొందరు మనుష్యులను తీసికొని వెళ్ల తంటాలు పడింది. అది మునిగిపోయి అందులో ఉన్న ప్రతి ఒక్కరు

చనిపోతారేమోనని భయపడుతూ ఉంటే, నిద్రించే ఒక ప్రయాణికుడు మేల్కొని "నిమ్మళించుము!" అని తుఫానుతో పల్కితే ఆ సరస్సు అప్పటికి అప్పుడే నిమ్మళమై పోయినప్పుడు, ఆ పడవ ఆశ్చర్యపోయింది. రాజులకు రాజును తాను మోసికొనిపోతున్నట్టు ఆ చెట్టుకు అప్పుడు అర్థమయ్యిందట. ఒక రోజు మూడవ చెట్టు కొయ్య మొద్దుల కుప్పలోనుండి లాగబడి, రక్తం కారుతున్న ఒక మనిషి వీపుకు ఆనుడుగా నిలుపబడింది. ఆయన వీధుల గుండా నడిపింపబడి, తన మరణం కొరకు కేకలు వేసి ద్వేషించే మనుష్యులచేత చుట్టబడియున్నాడు. పట్టణం దాటిన తరువాత ఆ మనుష్యుడు ఆ చెట్టుకు మేకులతో కొట్టబడి, మరణించునట్టుగా పైకెత్తబడ్డాడు. అది జరుగుతూ ఉండగా, ఆ మూడవ చెట్టు దిగులుపడింది, ఈ మనిషిపై చేసిన అత్యాచారం కన్నా భక్తిహీన కార్యం మరేదీ లేదని అనుకుంది. దేవుని వైపుకు మనుష్యులను సూచించడమే అది కావాలని కోరుకుంది. మూడు దినాల తరువాత లోకం మారిపోయింది: ఆ మనుష్యుడు మృతులలోనుండి లేచాడు, జనులు తనవైపు ఎప్పుడు చూచినా, ఆ నాటనుండి జనులు దేవుని గూర్చి ఆలోచిస్తారని ఆ మూడవ చెట్టుకు తెలుసు! మూడు చెట్లు విభిన్నమైన నిరీక్షణలు, కలలు కలిగియుండి అందులో ప్రతి ఒక్కటి దేవుని మహిమను కీర్తించాయి.

"మహిమ" అనేది యోహాను సువార్తలో ముఖ్యమైన చర్చనీయాంశమని మనం ముందుగానే చూచాం. "ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను; తండ్రివలన కలిగిన అద్వితీయకుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" అని యోహాను వ్రాసిన దానిని ఈ సువార్త రచనలో ముందుగా ఎదుర్కొన్నాం (1:14). యోహానులో "మహిమపరచు" అనే క్రియా వాచకం ఇరవై మూడు సార్లు, "మహిమ" అనే నామవాచకం పదునెనిమిది సార్లు కన్పిస్తుంది. వాస్తవంగా, యేసు జీవితాన్ని గూర్చి యోహాను యొక్క రచన మహిమపై కేంద్రీకరించింది!

## దేవుని మహిమ మరియు యేసు

మన పాఠ్య భాగం ఆరంభించినప్పుడు, పస్కా పండుగతో యెరూషలేము ఉత్సాహంగా కళకళలాడుతుంది, జన సమూహాలు ప్రభువైన యేసు వస్తాడని ఎదురు చూస్తున్నారు. ఆయన ఎలా వస్తాడు? ఆయన ఏమి చేస్తాడు? దీర్ఘకాలంగా కనిపెట్టుకొనియున్న మెస్సీయ తానేయని ప్రకటించి ఈ సమయంలో ఆయన ఇశ్రాయేలుకు రాజు కాబోతున్నాడా? ప్రతి ఒక్కరు యేసును గూర్చి మాట్లాడుకొంటున్నారు.

యేసు యెరూషలేములో ప్రవేశించే సమయం వచ్చినప్పుడు, ఆయన పట్టణాన్ని సమీపిస్తుండగా, గొప్ప జన సమూహము ఆయనను ఎదుర్కొనబోయారు. ఖర్జూరపు మట్ట పట్టుకొని – "జయము, ప్రభువు **పేరట వచ్చుచున్న ఇశ్రాయేలు రాజు స్తుతింపబడును గాక** అని" కేకలు వేశారు (12:13; ఒత్తి పలకడం నాది). వారు యేసునకు రాజుయొక్క ఆహ్వానాన్ని యిచ్చారు, ఘన స్వాగతం పలికారు. జెకర్యా 9:9లోని ప్రవచనాన్ని నెరవేర్చుతూ, గాడిద పిల్లనెక్కి యేసు యెరూషలేములో ప్రవేశించాడు. ఆయన శిష్యులు ఈ సంగతులు మొదట గ్రహించలేదు. ఆయన "మహిమపరచబడినప్పుడు" వాటి

ప్రాముఖ్యతను గ్రహించారు (12:16). ప్రభువైన యేసు జీవితంలోని ప్రతి సంఘటనలోను మహిమ కన్పిస్తుంది గాని సిలువ వద్ద అది అత్యంతంగా ప్రకాశించింది. మహిమ అంటే లోకానికి అధికారము లేక శక్తి, కీర్తి, ఐశ్వర్యంతో కూడినదైయుండగా, దేవుని యొక్క మహిమ ప్రేమ, వినయము, సిలువ వద్ద త్యాగమందు స్పష్టంగా గోచరిస్తుంది.

ఆ పండుగలో కొందరు గ్రీసుదేశస్థులు[1] ఫిలిప్పు వద్దకు వచ్చి – "అయ్యా, మేము యేసును చూడగోరుచున్నామని అతనితో చెప్పగా" (12:21), ఫిలిప్పు, అంద్రెయలు కలిసి వారిని యేసు వద్దకు తోడుకొని వచ్చారు. ప్రభువు వారితో యిలా అన్నాడు: "మనుష్యకుమారుడు మహిమ పొందవలసిన గడియ వచ్చియున్నది" (12:23). మరల, "మహిమ" అనేది సిలువను సూచిస్తూ ప్రస్తావించబడింది. గోదుమ గింజ భూమిలో పడి చావకుండిన యెడల అది ఒంటిగానే ఉండును; అది చచ్చిన యెడల విస్తారముగా ఫలించును అని ఆయన ఆ క్రింది వచనాలలో వర్ణించాడు. తన సొంత సిలువ మరణాన్ని గూర్చి మాట్లాడినప్పుడు, సమర్పణ, త్యాగము అనే తన మాదిరిని అనుసరించుడని ఆయన తన శిష్యులకు తెలిపాడు. వారలా చేసినట్లయితే, తండ్రి వారిని ఘనపరచునని ఆయన సూచించాడు.

తరువాత వచనాల్లో 28వ వచనంనుండి ప్రార్థన ఆరంభమై యిలా అనబడింది: "తండ్రీ, నీ నామము మహిమ పరచుమని చెప్పెను" అంతట – "నేను దాని మహిమ పరచితిని, మరల మహిమపరతును అని యొక శబ్దము ఆకాశమునుండి వచ్చెను" (12:28). కాబట్టి అక్కడ నిలుచుండి వినిన జన సమూహము – ఉరిమెను అనిరి. మరికొందరు – దేవదూత ఒకడు ఆయనతో మాటలాడెననిరి. ఆ శబ్దం వారికొరకు వచ్చినట్టు ప్రభువు చెప్పాడు. నిజంగానే తండ్రి పలికాడు. ప్రాథమికంగా మహిమ అని ఆయన సూచించింది సిలువయే. తన జీవితంలో మాటలాడినా, జరిగించినా ప్రతి విషయంలోను యేసు తండ్రిని మహిమపరచాడు. అయితే అత్యున్నతమైన మహిమ కొద్ది దినాల్లో కన్పించబోతుంది. – ప్రభువైన యేసు సిలువ వేయబడి మృతులలోనుండి లేపబడినప్పుడు, "నేను భూమిమీదనుండి పైకెత్తబడినయెడల అందరిని నాయొద్దకు ఆకర్షించుకొందునని" చెప్పినప్పుడు సిలువను గూర్చి మాట్లాడుతున్నట్టు ఆయన ఎరుకచేశాడు లేక విశదపరచాడు (12:32). "తాను ఏవిధముగా మరణము పొందవలసి యుండెనో సూచించుచు ఆయన ఈ మాట చెప్పెనని" యోహాను వ్యాఖ్యానించాడు (12:33).

అప్పుడు జనులు "ధర్మశాస్త్రము చెప్పుట విన్న" ఒక విషయాన్ని గూర్చి ఆయనను అడిగారు (12:34). వందల సంవత్సరాలకు ముందు సీనాయి కొండవద్ద ఇశ్రాయేలీయులు దేవుని శబ్దం విన్నారు.[2] ఉరుము, మెరుపు, బూరధ్వని, లేచిన పొగ అనేవాటినుండి ఇశ్రాయేలీయులు దేవుని మహిమను కొద్దిగా చూచారు. ఇప్పుడు, యిన్ని సంవత్సరాలు గతించిన తరువాత యేసును చూస్తూ ఆయన మాటలు ఆలకించడంతో వారు ఎక్కువగా దేవుని మహిమను చూస్తున్నారు. తన సిలువ మరణము పునరుత్థానాలయందు యింతకు ముందు ఎన్నడు కన్పించనంత అధికమైన మహిమను యేసు బయలుపరచనున్నాడు!

రాజ స్వాగతంచే ఆహ్వానింపబడి, యెరూషలేములో ప్రవేశించి ఈ అధ్యాయంలో దాఖలు చేయబడిన మాటలు పలికిన తరువాత యేసు జన సమూహమునుండి వెళ్లిపోయి దాగుకొన్నాడు. ఆయన వారికి సత్యము చెప్పినందునను, తన నిజ స్థితిని, శక్తిని తాను జరిగించిన సూచక క్రియల ద్వారా బయలుపరచినా, జనులు నమ్మనందుకు ప్రభువు బాధపడ్డాడు. ప్రజలకు విశ్వాసం లేకపోవడం యెషయా ప్రవచించినదానివలె యోహాను చూచాడు: "**మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను? యెహోవా బాహువు ఎవనికి బయలుపరచబడెను**?" (యెషయా 53:1; ఒత్తి పలకడం నాది). "**వారు కన్నులతో చూచి, చెవులతో విని, హృదయముతో గ్రహించి, మనస్సు మార్చుకొని స్వస్థత పొందక పోవునట్లు ఈ జనుల హృదయము క్రొవ్వచేసి వారి చెవులు మందపరచి వారి కన్నులు మూయించుమని చెప్పెను**" (యెషయా 6:10; ఒత్తి పలకడం నాది). యోహాను యిలా వ్రాశాడు: "యెషయా ఆయన మహిమను చూచినందున ఆయననుగూర్చి ఈ మాటలు చెప్పెను" (12:41). ఇక్కడ, ఈ అధ్యాయంలో నాల్గవ సారి "మహిమ" అనేది క్రీస్తు మరణము, సమాధి, పునరుత్థానాలను సూచిస్తోంది.

## దేవుని మహిమ మరియు మనము

తనను గూర్చియు దేవుని మహిమను గూర్చియు ఈ అధ్యాయంలో యేసు ఏమి చెప్పాడో దానితో జతచేయబడి "మహిమ" యొక్క ఈ సందేశం మన జీవితాలకు స్పష్టంగా, నేరుగా మార్పు కలిగించేదిగా ఉన్నట్టు మనం కనుగొంటాం. ప్రభువు తన శిష్యులకు యిలా చెప్పాడు: "మనుష్య కుమారుడు మహిమ పొందవలసిన గడియ వచ్చియున్నది" (12:23). ఆయన మరణము యొక్క ఆవశ్యకతను అక్కడ వివరించి (12:24) యిలా అన్నాడు:

> తన ప్రాణమును ప్రేమించువాడు దానిని పోగొట్టుకొనును; ఈ లోకములో తన ప్రాణమును ద్వేషించువాడు నిత్య జీవము కొరకు దానిని కాపాడుకొనునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. ఒకడు నన్ను సేవించిన యెడల నన్ను వెంబడించవలెను; అప్పుడు నేను ఎక్కడ ఉందునో అక్కడ నా సేవకుడును ఉండును; ఒకడు నన్ను సేవించిన యెడల నా తండ్రి అతని ఘనపరచును (12:25, 26).

ఈ భాగంలోని ఆలోచనా సరళి ఈ క్రింది విధంగా ఉంది: క్రీస్తు మహిమపరచ బడబోతున్నాడు. దానికి భిన్నంగా ఎదురు చూచేవారికి అది ఎలాటి భావాన్ని యిచ్చినా, మహిమపరచబడడానికి మరణించడం ఆయనకు అవసరం. అదే విధంగా, వారి గర్వము, స్వార్థపరత్వము, ఈలోకం కొరకైన ప్రేమ అనేవి దేవునికి లోబడడం కొరకు "చనిపోయినప్పుడు," యేసు యొక్క శిష్యులు నిత్యజీవాన్ని పొందుతారు, దేవుని మహిమను బయలుపరుస్తారు.

12:25, 26లో తన అనుచరులు చేయవలసిందిగా యేసు చెప్పినదానికిని, తరువాత ఈ అధ్యాయంలో రహస్యపు విశ్వాసులు చేసిన దానికిని చాల వ్యత్యాసం కన్పిస్తుంది:

అయినను అధికారులలో కూడ అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి గాని, సమాజములోనుండి వెలివేయబడుదుదునేమో యని పరిసయ్యులకు భయపడి వారు ఒప్పుకొనలేదు. వారు దేవుని మెప్పుకంటె మనుష్యుల మెప్పును ఎక్కువగా అపేక్షించిరి (12:42, 43).

"మెప్పు" అని 43వ వచనంలో రెండు సార్లు తర్జుమా చేయబడినదానికి గ్రీకు పదం *doxa*. ఈ పాఠంలో మనం చర్చించిన "మహిమ" అనేది కూడా యిదే పదంనుండి తర్జుమా చేయబడింది. పిరికివారైన విశ్వాసులు తమ విశ్వాసాన్ని రహస్యంగా ఉంచుకున్నారు ఎందుకంటె వారు "దేవుని మహిమ కంటెను మనుష్యుల మహిమను ఎక్కువగా అపేక్షించిరి." మనుష్యుల మహిమ తమ గర్వము అధికారము లేక బలము, సొంత కాపుదల, సొంత పెంపుదలలో కన్పిస్తుంది; దేవుని మహిమ వినయము, త్యాగము, తన్ను తాను ఉపేక్షించుకొనడంలో కన్పిస్తాయి.

తరువాత, ఈ సువార్త రచనలో, యేసు పేతురుకు చేసిన అసాధారణమైన ప్రవచనాన్ని యోహాను యిలా దాఖలు చేశాడు:

నీవు యౌవనుడవై యుండినప్పుడు నీ అంతట నీవే నడుము కట్టుకొని నీ కిష్టమైన చోటికి వెళ్లుచుంటివి; నీవు ముసలివాడవైనప్పుడు నీ చేతులు నీవు చాచుదువు, వేరొకడు నీ నడుము కట్టి నీ కిష్టము కాని చోటికి నిన్ను మోసికొని పోవునని నీతో నిశ్చయముగా చెప్పుచున్నానని అతనితో చెప్పెను (21:18).

యోహాను దానిని యిలా వివరిస్తున్నాడు, "అతడు ఎట్టి మరణమువలన దేవుని మహిమపరచునో దాని సూచించి ఆయన ఈ మాట చెప్పెను" (21:19). ఈ సువార్త ఉపదేశంలో త్యాగము, మహిమ ఒకదానితోనొకటి ముడివేయబడింది!

క్రైస్తవులు దేవుని మహిమకొరకు బ్రదకాలి. మనకు సంబంధించిన ప్రతిదీ దేవుని మహిమను ప్రచురించాలి (1 కొరింథీ. 10:31). చరిత్ర కాలంలో, గొప్ప దేవాలయాలను లేక రాజ్యాలను ఆయన పేరట నిర్మించడం ద్వారా దేవుని మహిమపరచ ప్రయత్నించారు. యోహాను సువార్తలో, అల్పమైన వినయమైన కార్యాలలో శ్రేష్ఠంగా కన్పిస్తున్నట్టు మాటి మాటికి ప్రదర్శింపబడింది. నేడు దేవుని మహిమ ప్రేమతో కూడిన త్యాగపూరితమై ప్రదర్శింపబడుతుంది. అవి లోకంచేత గుర్తింపబడకపోవచ్చు కూడా:

బిడ్డ యెడల తల్లి యొక్క ప్రేమపూర్వకమైన శ్రద్ధయందు దేవుని మహిమ బయలు పరచబడుతుంది.

వృద్ధురాలైన తల్లి లేక పొరుగువారి యెడల చూపే శ్రద్ధ దేవుని మహిమ బయలు పరచబడుతుంది.

బాధింపబడుతున్న వ్యక్తిని ఆలకించి ఆదరించడంవలన దేవుని మహిమ బయలు పరచబడుతుంది.

నీ వివాహానికి నమ్మకంగాను దయగాను ఉండడంలో దేవుని మహిమ బయలు పరచబడుతుంది.

> అవసరతలో ఉన్న వ్యక్తికి సహాయం చేయడంలో దేవుని మహిమ బయలు పరచబడుతుంది.

ఒక రోజున గొప్ప ప్రసంగికులను గూర్చి స్కూలులో టీచర్ మాట్లాడగా విన్నాను. అతడు యిలా అన్నాడు: "నీవు ఎన్నడూ వెళ్ళని స్థలాల్లో నీవు ఎన్నడు వినని ప్రజలచేత అతి గొప్ప ప్రసంగం చేయబడుతున్నావ్." యోహాను 12లో ప్రభువైన యేసు బోధించేదానికి శక్తివంతమైన అతని వ్యాఖ్య దగ్గరగా ఉందని నేను నమ్ముతున్నా!

ఆస్ట్రేలియా కవియైన విక్టర్ డాలీ మరణ దినాల్లో ఆస్పత్రిలో బహు జాగ్రత్తగా శ్రద్ధగా ప్రేమగా చూడబడ్డాడు. తన మరణానికి ముందు అతడు చేసిన చివరి పనిగా తన్ను దయగా చూస్తున్నందుకు నర్సులకు వందనాలు చెప్పాడు. "వందనాలు మాకు చెప్పకండి, దేవుని కృపకు వందనాలు చెప్పండి" అని వారన్నారు. "అయితే మీరు దేవుని కృప కారా?" అని డాలీ జవాబిచ్చాడట. అతడు రైటని నేను నమ్ముతున్నా. అదే విధంగా, నీవు నేను దేవుని మహిమను చూచాము, పొందాము, మరి యిప్పుడు మనం ఆయన మహిమగా ఉండాలి. వినయముతో కూడిన, త్యాగపూరితమైన సేవలో, ఈ లోకమందు మనం కన్పించే దేవుని మహిమగా ఉండాలి.

## ముగింపు

దేవుని కొరకు అవి ఏమి చేయగలవో ఆ మూడు చెట్లు గొప్ప కలలు కన్నాయి. అయితే విడ్డూరంగా, అవి నరకబడినప్పుడు, ముక్కలుగా కోయబడినప్పుడు, ఎరుకబడని విధంగా విడిచి పెట్టబడినప్పుడే, అవి దేవుని మహిమ కొరకు వినియోగింపబడ్డాయి. తన జీవితంలోను – మన జీవితాల్లో కూడా అదే నిజమైయున్నట్టు యేసు తెలిపాడు! "మా జీవితాల్లో దేవా, నేడు మహిమపరచబడండి" అని చిన్న ప్రార్థన అనుదినం చేద్దాం.

---

సూచనలు

[1]వీరు "దేవునికి భయపడి" యూదా మత బోధచే ఆకర్షింపబడినా, సున్నతి పొంది పూర్ణంగా యూదా మతంలోనికి మార్పు పొంద నిష్టపడనివారై ఉండవచ్చు. అందువలన, వారు అన్య జనులుగానే మిగిలిపోయి, అన్యుల ప్రాంగణంలో మాత్రమే – యెరూషలేము దేవాలయంలో ఆరాధించ వారు వచ్చినప్పుడు నిలిచియుండేవారు. "గ్రీసు దేశస్థులు" అని ఈ లేఖన భాగంలో సూచింపబడినవారు, గ్రీసు దేశానికి చెందినవారనే భావంతో కాక, "దేవునికి భయపడు"వారని అర్థం అయ్యుండవచ్చు. [2]నిర్గమ. 20; ద్వితీయో. 5:22.